సాక్షి
చిత్తూరు
సోమవారం ı 28 ı అక్టోబర్ ı 2024



గణపయ్యా.. మన్నించయ్యా!
వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఇప్పటికీ చెరువులో దర్శనమిస్తున్నాయి. - 8లో



మహిళ మెడలో గొలుసు చోరీ
రోడ్డుపై ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లిన సంఘటన ఐరాల మండలంలో వెలుగుచూసింది. - 8లో



జేబుదొంగల చేతివాటం
బోయకొండ ఆలయం కిక్కిరిసిపోవడంతో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించగా, భక్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే
చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

బోయకొండ కిటకిట



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ తల్లి దీవెనల కోసం భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో క్యూలన్నీ కిక్కిరిసి పోయాయి. సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జంతు బలులు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. దర్శన టికెట్లు, అమ్మవారి ప్రసాదాల విక్రయం ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.9,94,300 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

పదికే బంధీ



బాలికలు పదో తరగతికే బంధీ అయిపోతున్నారు. జీవితం గురించి కలలు కనే వయసులోనే మూడుముళ్ల బంధంలో అడుగుపెడుతున్నారు. అమ్మానాన్నల నుంచి మంచీ చెడూ నేర్చుకునే వయసులోనే బిడ్డకు జన్మనిచ్చేస్తున్నారు. కాపురం గురించి తెలియకుండానే సంసార సాగరాన్ని ఈదుతున్నారు. ఎక్కువమంది గర్భధారణ సమయంలో ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారు. మరి కొందరు ప్రసవ సమయంలో మృత్యు ఒడికి చేరుతున్నారు. నేటికీ ఈ సమాజంలో ఆడబిడ్డను భారంగానే భావిస్తున్నారు. అమ్మాయికి పెళ్లి చేస్తే బాధ్యతలు తీరిపోతాయని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఫలితంగా బాలిక జీవితం పసుపుతాడుకు బలైపోతోంది.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- బాల్య వివాహం.. జీవితం దుర్భరం
- జిల్లాలో ఏడు నెలల్లో 71 పెళ్లిళ్లు
- అందరూ 10వ తరగతి లోపు వారే
- చట్టాలున్నా ప్రయోజనం శూన్యం

కార్వేటినగరం: బడి ఈడు వయసులోనే పెళ్లిళ్లు అవుతున్నాయి. బాల్య వివాహాలతో జీవితం ముళ్లబాటగా మారుతోంది. ఆడపిల్లను బాధ్యత, బరువుగా భావిస్తున్న తల్లిదండ్రులు పేదరికం, నిరక్షరాస్యత కారణంగా చదువు పూర్తి కాకుండానే పెళ్లి చేస్తున్నారు. వారికి ఇష్టం లేకపోయినా ఒత్తిడి చేసి మరీ బలవంతంగా పెళ్లిపీటల మీద కూర్చోబెడుతున్నారు. పెళ్లి, సంసారం, జీవితమంటే ఏంటో తెలియని వయసులోనే అమ్మాయిలు బంధాల బాధ్యతల్లో బంధీ అవుతున్నారు. ప్రతి నెలా జిల్లాలో సరాసరిన పది బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఈ సంవత్సరం జూలై వరకు 71 బాల్య వివాహాలు జరిగినట్లు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి వచ్చింది. ఇక వారి దృష్టికి రానివి మరో వంద వరకూ ఉంటాయి. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ 26 వరకు జిల్లాలో 13 ఏళ్ల నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న (ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న) అమ్మాయిల్లో 16.4 శాతం మందికి, అబ్బాయిల్లో 2 శాతం మందికి బాల్య వివాహాలు జరిగినట్లు సమాచారం

కమిటీలెన్ని ఉన్నా ప్రయోజనం శూన్యం
బాల్య వివాహాల నిరోధక చట్టం -2006కు సంబంధించి నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012- మార్చి 19న జీవో ఎంఎస్ నం-13ను విడుదల చేసింది. బాల్యవివాహాలను నివారించి ప్రజల్ని చైతన్యం చేసేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ జీవోలో స్పష్టంగా ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఐసీడీఎస్ పీడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి కన్వీనర్లుగా ఉన్నారు. డివిజన్ స్థాయిలో చైర్మన్‌గా ఆర్డీవో, కన్వీనర్లుగా డీఎస్పీ, సీడీపీవో, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా, ఎంపీడీవో, ఎస్.ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కన్వీనర్లుగా ఉంటున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా అంగన్‌వాడీ కార్యకర్తలు కన్వీనర్లుగా పంచాయతీ కార్యదర్శి, పాఠశాల హెచ్‌ఎం, ఏఎన్‌ఎం, మహిళా వార్డు మెంబర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, మహిళా సంఘ సభ్యులు ఉంటున్నారు. ఇన్ని కమిటీలు ఉన్నప్పటికీ జిల్లాలో బాల్య వివాహాలు ఆగడం లేదు. సమాజంలో మార్పు రానంతవరకూ, తల్లిదండ్రుల ఆలోచనల్లో పరిణితి వచ్చేవరకూ ఈ బాల్య వివాహాలు కొనసాగుతాయన్నది వాస్తవం. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కారణాలు ఇలా..
బాల్య వివాహాలకు ఎన్నో రకాల కారణాలు ఉంటున్నాయి. ఆడపిల్లలకు పెళ్లి చేస్తే ఇక తమ బాధ్యత తీరిపోతుందని కొందరు, బాగా డబ్బున్న సంబంధం కుదిరిందని ఇంకొందరు ఆలోచిస్తున్నారు. ఒక వేళ అమ్మాయి వయసు పెరిగే కొద్దీ స్వీయ నిర్ణయాలు తీసుకుని తాము చెప్పిన సంబంధం చేసుకుంటుందో లేదో అనే ఆలోచనతో మరి కొందరు ముందే పెళ్లి చేస్తున్నారు. పిల్లలు ఎక్కడ ప్రేమలో పడి తల్లిదండ్రులకు చెడ్డ పేరు తెస్తారో అన్న ఆలోచనతో కొందరు. పలు కారణాలతో ఆడ పిల్లలకు తల్లి దండ్రులు బాల్య వివాహాలు జరిపించేస్తున్నారు.

అమ్మాయిల పరిస్థితి దుర్భరం
బాల్యవివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. వారు సంసారం, కుటుంబం, పిల్లల బాధ్యత మోస్తూనే మరోవైపు అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. తమ ఆరోగ్య సమస్యలపై భర్తతో కూడా చెప్పుకోలేని బాధలను వారు అనుభవిస్తున్నారు. కూలి పనో లేదా ఏదైనా ఉద్యోగమో చేసి డబ్బులు సంపాదిస్తున్నప్పటికీ వారు ఇంట్లో వంట పని, ఇంటి పని, కుటుంబ సభ్యులందరికీ సేవలతోపాటు చాకిరీ తప్పడం లేదు.

ఆడబిడ్డను కన్నా వేధింపులే
మనకు స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా తల్లి దండ్రుల ఆలోచనల్లో మార్పు రాలేదు. ఇప్పటికీ ఆడ బిడ్డను కన్న మహిళలకు వేధింపులు తప్పడం లేదు. ప్రసవించి రెండు నెలలు కూడా నిండకనే ఆ తల్లిని కూలి పనులకు పంపుతున్నారు. కుటుంబంలో వంశోద్ధారకుడు జన్మించే వరకూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేది లేదు. అనే మాటలు ఇప్పటికీ ఎన్నో ఇళ్లలో వినపడుతూనే ఉన్నాయి. పేదలే కాదు బాగా డబ్బులున్న ఇళ్లలో కూడా మగ బిడ్డ కోసం సంతతిని పెంచుకుంటున్నారు.



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

జిల్లాలో మండలాలు	31
ఐసీడీఎస్ కేంద్రాలు	12
పురుషుల సంఖ్య	9,25,385
మహిళల సంఖ్య	9,17,101
2024 జనవరి నుంచి జూలై వరకు జరిగిన బాల్య వివాహాలు	71

ఆరోగ్యకరం కాదు



అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకనే పెళ్లి చేయడం ఆరోగ్యకరం కాదు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా అంతగా ఎదిగి ఉండరు. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతోపాటు తల్లికి కూడా ప్రమాదమే. బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయి. బాల్య వివాహాలు వద్దు అని ఒక అధికారిగానే కాకుండా ఒక మహిళగా కూడా సలహా ఇస్తున్నాను. తల్లిదండ్రులు అర్థం చేసుకుని వారి బిడ్డల ఆరోగ్యానికి తోడ్పాటునందించాలి.

– డాక్టర్ ప్రభావతిదేవీ, డీఎంహెచ్‌వో, చిత్తూరు

అవగాహన కల్పిస్తున్నాం



బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బాల్య వివాహం జరుగుతున్నట్లు మా దృష్టికి రాగానే స్థానిక పోలీసుల సహకారంతో వెంటనే అక్కడికి వెళ్లి ఆపేస్తున్నాం. బాధిత అమ్మాయిలను వారి అభిరుచి మేరకు షెల్టర్ హోమ్స్, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, సర్వీస్‌హోంలకు పంపుతున్నాం. కానీ బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను తల్లిదండ్రులు గుర్తించాలి.

– హైమావతి, ఐసీడీఎస్ పీడీ, చిత్తూరు

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



చట్టం ప్రకారం ఆడ బిడ్డకు 18 ఏళ్లు, మగవారికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలి. అప్పుడే వారికి శారీరక, మానసిక పరిపక్వత వస్తుంది. బాల్య వివాహం చేసిన తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, అనుమతించిన పెద్దలు, సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. వీరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమా నా విధిస్తారని అందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

– హనుమంతప్ప, సీఐ, కార్వేటినగరం

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మత్స్యంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం పూర్తి చేసి, కనులపండువగా అంకురార్పణ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పవిత్ర ప్రతిష్ఠ
సోమవారం పవిత్రోత్సవాల్లో భాగంగా దేవదేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. వైదిక కార్యక్రమాల అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

కళాశాలలో గంట.. బస్సులో తంటా



బైరెడ్డిపల్లెలో బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థినులు

కళాశాల పని వేళల్లో అదనంగా గంట పెంచడం వల్ల విద్యార్థినుల గుండెల్లో గుబులు రేగుతోంది. చీకటి వేళ ఇంటికి చేరుకోలేక అవస్థలు పడాల్సి వస్తోంది. కాలేజీలో గంట సమయం పెరిగితే ఇంటికి చేరుకోవడానికి మూడు నాలుగు గంటలు ఆలస్యమవుతోంది. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ, ఒకేషనల్ జూనియర్ కళాశాలలకు చిత్తూరు రూరల్, యాదమరి, తవణంపల్లె మండలాల నుంచి విద్యార్థులు విచ్చేస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలు నిర్వహించాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీని వల్ల చిత్తూరు రూరల్ మండలంలోని సిద్ధంపల్లి, ఆనగల్లు, అనంతాపురం, ఆయనవేడు, మాపాక్షి, పాలూరు, పెద్దిశెట్టిపల్లి గ్రామాల నుంచి జూనియర్ కళాశాలలకు వస్తున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామాలకు ప్రైవేట్ బస్సు ఒకటి, అరకొరగా వెళ్లే ఆర్టీసీ బస్సు ఒకటే దిక్కు. సాయంత్రం 5 గంటలకు విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో అగచాట్లు పడుతున్నారు. అమ్మాయిల పరిస్థితి అయితే మరీ దారుణం. విద్యార్థినులు ఇంటికి వెళ్లే సరికి రాత్రి 8 గంటలు దాటుతోందని చెబుతున్నారు.

జిల్లా సమాచారం

ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలు	31
మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు	16,232
ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు	22,857
ఇంటర్ చదువుతున్న బాలికలు	25,471
సమయం పెంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికలు	21,458

- జూనియర్ కళాశాలల సమయం గంట పెంపు
- ఇంటర్ విద్యార్థులకు రవాణా సమస్యలు
- ఇళ్లకు వెళ్లేందుకు బాలికలకు అవస్థలు
- ఇంటి వద్ద ఎదురుచూస్తున్న తల్లిదండ్రుల్లో ఆందోళన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో కూటమి ప్రభుత్వం విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులపై పగ బట్టింది. సజావుగా సాగుతున్న ఇంటర్మీడియట్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. విద్యా సంవత్సరం మధ్యలో జూనియర్ కళాశాలల సమయాన్ని మారుస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల వల్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సమయం పెంచడం వల్ల విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు రవాణా వసతి లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ కళాశాలల్లో చాలా వరకు పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుతున్నారు. జిల్లాలో చాలా వరకు మండల, పట్టణ కేంద్రాల్లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. మండల కేంద్రాల నుంచి బస్సు సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నా సమయానికి రాకపోవడం, ఉదయం వస్తే సాయంత్రం రాకపోవడం వంటి సమస్యలూ ఉన్నాయి.

సమయం మార్పుతో సమస్యలు
జిల్లా వ్యాప్తంగా అధిక శాతం విద్యార్థినులు మండల పరిధిలో దూరాభారంగా ఉండే గ్రామాల నుంచి కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వీరికి సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 65 శాతం మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 50 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. సాయంత్రం 5 గంటల తర్వాత బస్సు సౌకర్యం లేని గ్రామాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి. కొన్ని మండలాల్లో సైకిళ్లపై వెళ్తున్నారు. మరి కొన్ని మండలాల్లో ఆటోలలో వెళ్తున్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో రాత్రి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. వీరు అధిక శాతం మంది ఆ కళాశాల బస్సుల్లో ఇళ్లకు జాగ్రత్తగా చేరుకుంటారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక బస్సుల సౌకర్యం లేకపోవడం సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇంటికి వెళ్లే సరికి తొమ్మిదవుతోంది



మాది బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి. మా ఊరి నుంచి ఆటోల్లో బైరెడ్డిపల్లికి వెళ్లాలి. అక్కడి నుంచి పలమనేరుకు 22 కిలోమీటర్లు. పల్లె వెలుగు బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియదు. కళాశాల సమయాన్ని గంట పెంచడం వల్ల బైరెడ్డిపల్లెకి వచ్చేలోపు రాత్రి 7 నుంచి 8 గంటలవుతుంది. మళ్లీ అక్కడి నుంచి మా గ్రామానికి ఏడు కిలోమీటర్లు వెళ్లాలి. ఆ సమయంలో ఆటోలేమీ ఉండవు. అక్కడి నుంచి కాలినడకన ఇంటికి వచ్చే సరికి రాత్రి తొమ్మిది గంటలవుతోంది.

– జగదీష్, ఇంటర్ విద్యార్థి, పలమనేరు


భయం వేస్తోంది



సాయంత్రం కళాశాల వదిలే సరికి 5 గంటలవుతుంది. అప్పటికే చీకటి పడుతోంది. ఆ సమయంలో మా గ్రామానికి వెళ్లాలంటే ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. ఆటోల కోసం వేచి చూడాల్సిందే. ఒక్కో సారి ఆటోలో చాలా రద్దీగా ఉండడం వల్ల ఆపకుండా వెళ్లిపోతారు. ఇంతకు ముందు సాయంత్రం 4 గంటలకే కళాశాల వదిలే వారు. ఆ సమయంలో కళాశాల నుంచి బయల్దేరితే సులువుగా ఇంటికి వెళ్లిపోవచ్చు. ఇప్పుడు సమయం పొడిగించడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

– కావ్యశ్రీ, ఇంటర్మీడియట్, ఐరాల

అర్థం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లోని ప్రభుత్వ కళాశాలలకు వచ్చి చదువుకుంటున్నాం. కళాశాల సమయం పెంపు వల్ల ఇబ్బందులు పడుతున్నాం. గతంలో కళాశాల సమయం నాలుగు గంటల వరకే ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఐదు గంటల వరకు పెంచడంతో బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. కార్వేటినగరం నుంచి శ్రీరంగరాజపురంలోని కొండపాల్యానికి చేరేలోపు రాత్రి అవుతుంది. తల్లిదండ్రులు నా కోసం ఎంతో ఆందోళనతో ఎదురుచూస్తున్నారు.

– లక్ష్మీప్రసన్న, ఇంటర్, శ్రీరంగరాజపురం

ఇబ్బందిగా ఉంది



సమయం మార్పు వల్ల చీకటి పడుతోంది. ఆ సమయంలో మా ఊరికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే నాలాంటి విద్యార్థినుల సమస్యలను అర్థం చేసుకోవాలి. ఇంటికి వెళ్లే సరికి ఆలస్యం అవుతుండడంతో తల్లిదండ్రులేమో భయం భయంగా నా కోసం ఎదురు చూస్తుంటారు. ఇలాంటి నిర్ణయాల వల్ల భవిష్యత్తుల్లో బాలికలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివే పరిస్థితి ఉండదేమో.

– అశ్విని, ఇంటర్, టీకేఎం పేట, కార్వేటినగరం మండలం

టీచర్లు బడికి వెళ్లాల్సిందే!


- బడికి వెళ్లని టీచర్లపై ప్రత్యేక నిఘా
- నూతన డీఈఓ వరలక్ష్మి వెల్లడి



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా సకాలంలో బడికి వెళ్లాలని నూతన డీఈఓ వరలక్ష్మి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు విచ్చేసిన ఆమె ఆదివారం డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు. 2008, 2015లో చిత్తూరు డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్ 1, 2గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా కావడంతో జిల్లాపై తనకు పట్టు ఉందన్నారు. ప్రభుత్వ ఆశయాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి చిత్తూరు జిల్లాకు అన్ని స్థాయిల్లో గౌరవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. శక్తి వంచన లేకుండా విధులు నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో బడికి డుమ్మా కొట్టే టీచర్లు ఉన్నట్లయితే వారి పట్ల ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కచ్చితంగా సమయపాలన పాటించి పాఠశాలలకు హాజరుకావాలన్నారు. నిత్యం ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఇష్టానుసారంగా గైర్హాజరుకావడం, అనుమతి లేకుండా పాఠశాలలు వదిలి వెళ్లడం వంటివి సహించేది లేదన్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం ఈ నెల 28న విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ నూతన డీఈఓలతో నిర్వహిస్తున్న సమావేశానికి ఆమె బయలుదేరి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన నూతన డీఈఓకు ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు సత్య, రామ్‌కుమార్, వీజీ రమణ, సిబ్బంది మురళి, గోపాల్, సాయి, విజయ, మదన్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు



ప్రకాశం జిల్లా బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఐరాల: మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖో-ఖో పోటీలు ఆదివారం ముగిశాయి. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మురళీమోహన్, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం క్రీడా రంగానికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు.

విజేతలు వీరే
పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ద్వితీయస్థానం కృష్ణ జిల్లా జట్టు సాధించింది. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్టు నిలిచింది. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, సెక్రటరీ శరత్ పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

క్లుప్తంగా

జాతీయ వాలీబాల్ పోటీలకు బంగారుపాళెం విద్యార్థి



అబుదూర్ రహమాన్‌ఖాన్

బంగారుపాళెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయ వాలీబాల్ పోటీలకు బంగారుపాళ్యానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన దావూద్‌ఖాన్ కుమారుడు అబుదూర్ రెహమాన్‌ఖాన్ పలమనేరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపుర్‌లో ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీల్లో ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



సీసీ కెమెరాలో నమోదైన చైన్ స్నాచర్లు

ఐరాల: గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలో గొలుసు అపహరించుకుపోయిన సంఘటన ఆదివారం మండలంలో వెలుగుచూసింది. ఎస్ఐ నరసింహులు కథనం మేరకు, గొల్లపల్లెకు చెందిన మునిరత్నం భార్య నాగరత్న పాటూరుకు వెళ్లడానికి శనివారం ఇంటి నుంచి బస్‌షెల్టర్ దగ్గరకు బయల్దేరింది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఎదురయ్యారు. ఏదో అడ్రస్ అడుగుతున్నట్లు నటించి మహిళ మెడలో ఉన్న 36 గ్రాముల తాళిబొట్టును తెంపుకొని ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గణపయ్యా.. మన్నించవయ్యా..!



''నేను అడిగానా..? ప్రకృతిలో ఇమిడిపోని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) రసాయనాలతో నన్ను పూజించమని..? నీ ఆనందం కోసం నన్ను వీధిలో పెట్టావు. పగలు, రాత్రి విపరీతమైన శబ్దాలు పెట్టి పక్కింటి వాళ్లకు నిద్ర లేకుండా చేశావ్. పిల్లల చదువులకు ఆటంకం కలిగించావ్. నువ్వే ఊరేగింపుగా తీసుకెళ్లావ్. నా తల్లి గంగమ్మలో కలిసిపోవాల్సిన నన్ను.. ఇదిగో ఇలా ముక్కలు, చెక్కలు చేసి నీటిలో పడేశావ్. ప్రకృతి నుంచి వచ్చిన నన్ను అదే ప్రకృతిలో కలపకుండా పాపాన్ని మూటగట్టుకున్నావ్. ఈ పీవోపీ నీటిలో కరగడానికి వందల ఏళ్లు పడుతుంది. నేను అడిగానా..? ఇలా చేయమని..'' అని ఆ విఘ్ననాథుడు ప్రశ్నించేలాగా ఉన్నాయి ఈ విగ్రహాలు. మానవుడు దానవుడిగా మారిపోతూ ప్రకృతిని సర్వనాశనం చేసేస్తున్నాడు. భావి తరాలకు పూడ్చలేని నష్టాన్ని కలిగిస్తూ.. మనిషి ఉనికికే ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాడు. చిత్తూరు నగరంలోని కట్టమంచి చెరువులో వినాయక చవితి నేపథ్యంలో నిమజ్జనం చేసిన ఆ గణనాథుని పీవోపీ ప్రతిమలు ముక్కలుగా విరిగి ఇలా నీటిపై తేలుతున్నాయి. బంక మట్టితో పూజించాల్సిన ప్రకృతి సహజమైన వినాయకుణ్ణి ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్టు వారి పూజిస్తూ.. చెరువును ఎందుకు పనికిరాకుండా చేసేశారు. కనీసం వీటిని అందులో నుంచి తీసేయాలని మున్సిపల్ అధికారులు కూడా అనుకోవడం లేదు. ఈ విగ్రహాలను చూసిన స్థానికులు మాత్రం గణపయ్యా... క్షమించయ్యా అంటూ లెంపలేసుకుంటున్నారు.

– చిత్తూరు అర్బన్





పైవ్రేటు కళాశాల విద్యార్థుల బీభత్సం

- గంజాయి తాగి రోడ్డుపై వీరంగం
- అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- టీడీపీ నేతల ఒత్తిళ్లతో వదిలేసిన వైనం

కుప్పం: టీడీపీ నేతకు చెందిన ప్రైవేటు కళాశాల విద్యార్థులు అర్ధరాత్రి రోడ్డుపై బీభత్సం సృష్టించిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు, అనిమిగానిపల్లె వద్ద రోడ్డుపై ప్రైవేటు కళాశాల విద్యార్థులు స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా శనివారం రాత్రి వేడుకలు నిర్వహించారు. వారందరూ గంజాయి తాగి రోడ్డుపై కేక్ కట్ చేసి చిందులు వేశారు. రాళ్లు విసురుతూ, కర్రలు చేతపట్టి రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూ వీరంగం చేశారు. దీనిపై రోడ్డుపై ప్రయాణించే వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కుప్పం పట్టణ పోలీసులు ఐదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. వారందరూ అప్పటికే గంజాయి మత్తులో తూలుతున్నట్లు గుర్తించారు. అయితే ఆదివారం ఉదయం ఈ సమాచారం కళాశాల యాజమాన్యానికి చేరింది. తమ విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు తెలిస్తే తల్లిదండ్రులు ఆగ్రహిస్తారని తెలుసుకుని, వెంటనే పట్టుబడిన యువకులను విడిపించేందుకు ప్రయత్నించింది. అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా వారిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మంతనాలు సాగడంతో ఈ విషయం బయటకు పొక్కింది. పోలీసులు మాత్రం అలాంటివేమీ జరగలేదంటూ సమాధానం దాటవేయడం గమనార్హం.

గంజాయి మొక్కలు స్వాధీనం ఇద్దరి అరెస్టు

రామకుప్పం: కుప్పం నియోజక వర్గ పరిధిలో అక్రమంగా గంజాయి సాగు చేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. శాంతిపురం మండలం అబకలదొడ్డికి చెందిన ఎనుముల మునెప్ప కుమారుడు చంద్రప్ప తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలు పెంచుకుని అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఆదివారం చంద్రప్పను అరెస్టు చేసి 5 కిలోల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు. రామకుప్పం మండలంలోని వీర్నమల పంచాయతీ గురుకులమడుగుకు చెందిన క్రిష్ణన్‌ను అతని ఇంటి వద్ద అరెస్టు చేసి 15 కిలోల గంజాయి (పచ్చి ఆకులు), ఎండిన గంజాయి ఆకులు 400 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. క్రిష్ణన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు, గుడుపల్లి ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేటలో చట్టవిరుద్ధంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఖాదర్‌బాషాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఖాదర్‌బాషాను పట్టుకుని అతని వద్ద నుంచి 42 లాటరీ టికెట్లు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. లాటరీ టికెట్ల వ్యాపారంపై పోలీసులు మఫ్టీలో గస్తీ తిరుగుతున్నట్లు సీఐ తెలిపారు.

చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- పాడి రైతులను కూటమి సర్కారు ఆదుకోవాలి
- అట్టహాసంగా సీపీఎం 14వ జిల్లా మహాసభ





మాట్లాడుతున్న వాడ గంగరాజు, అమర స్తూపానికి సెల్యూట్ చేస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కట్టమంచిలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో ఆదివారం ఆ పార్టీ 14 వ జిల్లా మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఆశలు గుప్పించిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపులోకి తీసుకురావాలన్నారు. జిల్లాలోని పాడిరైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెండవ సారి జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు ఎంపికయ్యారు. అనంతరం పలు డిమాండ్‌లకు జిల్లా మహాసభలో తీర్మానాలు చేశారు. ఈ మహాసభలో పార్టీ సీనియర్ నాయకులు హైదర్‌వలి, రాష్ట్ర నాయకులు రమాదేవి, దడాల సుబ్బారావు, నాయకులు ఓబుల్‌రాజు, సురేంద్రన్ గరిధర్‌గుప్త, భువనేశ్వరి, సృజని తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు ఇవే : జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. పాడి రైతుకు గిట్టుబాటుధర కల్పించాలి. స్కీమ్‌వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి. కనీస వేతనాలు అమలు చేయాలి. భూకబ్జాలు అరికట్టాలి. మహిళలు, చిన్నపిల్లలపై హత్యాచారాలు, దాడులు అరికట్టాలి. దళితులపై దాడులు అరికట్టాలి. ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి. హంద్రీనీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి. అడవిపల్లి రిజ్వారాయర్ పనులు పూర్తి చేసి చిత్తూరుకు తాగునీరు అందించాలి. జానపద కళాకారులకు కాణిపాకం దేవస్థానంలో కళాప్రదర్శనలకు అవకాశం కల్పించాలి. మామిడిరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. పవర్ లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని మహాసభలో తీర్మానాలు చేశారు.

బోయకొండలో జేబుదొంగల చేతివాటం

చౌడేపల్లె: బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీని అదునుగా భావించిన జేబుదొంగలు తమదైన శైలిలో చేతివాటం చూపారు. ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో కలిసి క్యూలో చేరుకున్న జేబు దొంగలు భక్తుడి జేబులో డబ్బులు కొట్టేస్తుండగా పట్టుకున్నారు. సుమారు రూ.25 వేల వరకు ఐదుగురు నగదు పోగొట్టుకొన్నట్లు బాధితులు వెల్లడించారు. భక్తులు అప్రమత్తమై పట్టుకొని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. పుంగనూరుకు చెందిన వారమని పొంతలేని పేర్లు చిరునామాలు చెప్పిన భార్య భర్తలిద్దరినీ కానిస్టేబుళ్లు రాజేష్, కిరణ్ పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కారు చోరీ చేసిన వ్యక్తికి దేహశుద్ధి



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున సుమో

చిత్తూరు అర్బన్: ఓ కారును చోరీ చేసి, దాని విడిభాగాలు వేరుచేస్తున్న వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. చిత్తూరు నగరంలోని కైలాశపురం రోడ్డులో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి, సుమోను చీకట్లో ఉంచి దాన్ని పార్టులుగా విప్పి ఆటోలో వేస్తున్నాడు. దీన్ని గుర్తించిన స్థానికులు ఆ వ్యక్తిని ప్రశ్నిస్తే పొంతన లేకుండా సమాధానం చెప్పాడు. తీరా తాను కారును చోరీ చేసినట్లు చెప్పడంతో స్థానికులు అతనిపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. కారు ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే విషయంపై పోలీసులు విచారిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రాంబాబు మృతదేహం

బి.కొత్తకోట : భార్యతో గొడవ పడిన తర్వాత భర్త చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయిన ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామాంజులు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం రాజుపల్లె గ్రామం కమ్మినాయునిపల్లెకు చెందిన బి.రాంబాబు (30)కు ఏడాది క్రితం బి.కొత్తకోట సమీపంలోని బాలసానివారిపల్లెకు చెందిన స్పందన (23)తో వివాహం అయింది. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో కలతలు చెలరేగాయి. స్పందన పుట్టింటిలో కాపురం ఉందామని ఒత్తిడి చేసింది. కొంత కాలంగా పుట్టింటిలో ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం రాంబాబు భార్య కోసం బాలసానివారిపల్లెకు వచ్చాడు. కాపురానికి రావాలని పిలవగా గొడవ జరిగింది. భార్యపై చేయి చేసుకున్నాడు. భార్య మరొకరితో చనువుగా ఉంటోందని అనుమానపడ్డాడు. తర్వాత గట్టు పంచాయతీ తరిగోడు సమీపంలోని చంద్రశేఖర్‌రెడ్డి పొలంలోని నేరేడు చెట్టుకు చీరతో ఉరి వేసుకుని రాంబాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం వెలుగు చూడటంతో పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పశుగణన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఆదివారం ఆయన ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ పశుగణన కార్యక్రమాన్ని అలసత్వం లేకుండా చేపట్టాలన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గాడిదలు తదితర అన్ని జంతువుల వయస్సు, లింగంతో సహా గణించాలని కలెక్టర్ తెలిపారు.

చిత్తూరులో పిచ్చి కుక్క స్వైరవిహారం



గాయాలతో ఆస్పత్రిలో ఉన్న వృద్ధురాలు



పిచ్చి పట్టి తిరుగుతున్న వీధి కుక్క

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ పిచ్చి కుక్క ఆదివారం స్వైర్వ విహారం చేసింది. స్థానిక 8వ డివిజన్‌లోని వెంగళరావు కాలనీలో పిచ్చి పట్టిన కుక్క పలువురిని కరవడంతో ఆస్పత్రి పాలయ్యారు. కాలనీలో మార్తమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా, వీధి నుంచి ఇంట్లోకి దూరిన కుక్క వృద్ధురాలిపై విచక్షణా రహితంగా దాడి చేసింది. కుక్క కాటుకు కలి మడమ కండరాలు ఊడిపోగా, చేతికి గాయాలయ్యాయి. ఈమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించినా మార్తమ్మ ఆరోగ్యం కుదుటపడలేదు. ఇదే కుక్క పక్క వీధిలో మరో ఇద్దరిపై దాడి చేసినట్లు చెబుతున్నారు. వీధి కుక్కల నియంత్రణలో మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయించి, మళ్లీ వాటితో పాటు ఇతర కుక్కల్ని కూడా ఆయా కాలనీల్లో వదిస్తుండడం వల్ల పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయి. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణపై దృష్టి పెట్టకుంటే ప్రజలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడంలేదు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



లోకేష్‌రావు (ఫైల్)

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు, పుత్తూరు మండలం గొల్లపల్లెకు చెందిన గంజి లోకేష్‌రావు స్నేహితునితో కలసి బైక్‌పై కార్వేటినగరానికి వస్తూ పద్మసరస్సు వద్ద హఠాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో వెనుక కూర్చున్న గంజి లోకేష్‌రావు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో అతనికి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అమర ఆస్పత్రికి తరలించారు. అయితే శనివారం రాత్రి మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్టడీ సెంటర్ ప్రారంభం



స్టడీ సెంటర్ ప్రారంభిస్తున్న భూమన, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి మంగళం: తిరుపతి ఎమ్మార్‌పల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్టడీసెంటర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు వీలుగా అన్ని వసతులతో స్టడీసెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాసేవతో పాటు విద్యార్థుల ఉన్నతి కోసం స్టడీసెంటర్ నెలకొల్పిన మునిరామిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.